క్లుప్తంగా

ఏజీపీగా రాడ రాజు నియామకం



కొత్తూరు: కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా మండలంలోని నివగాం గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ రాడ రాజును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు సోమవారం అందాయని రాడ రాజు తెలిపారు. ఈ పోస్టులో మూడేళ్లు కొనసాగవచ్చని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొందన్నారు.

కేజీబీవీ ఎస్‌ఓగా అంబిక



ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఎస్‌ఓగా మొదలవలస అంబిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల కేజీబీవీల్లో ఎస్‌ఓలు, టీచర్ల నియామక ప్రక్రియ చేపట్టింది. విధుల్లోకి చేరిన ఎస్‌ఓకు కేజీబీవీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కలుపు నివారణలో రైతులు బిజీ



కలుపు నివారణ మందు స్ప్రే చేస్తున్న రైతు

జలుమూరు: గత రెండు రోజులు కురిసిన వర్షాలకు వరి వెదల్లో కలుపు నివారణకు అవసరమైన రసాయన మందులు చల్లేందుకు వాతావరణం అనువుగా ఉందని వ్యవసాయ అధికారి కె.సురేష్ సోమవారం తెలిపారు. మండల పరిధిలో సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట సాగవ్వగా.. ఇందులో సుమారు 18,660 ఎకరాల వరకు వరి వెదలు వేశారన్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మొదటి కలుపు నివారణకు రైతులు సమాయాత్తం అవుతున్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి బాగుంటుందని ఏఓ సూచించారు. కలుపు నివారణ మందులు కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.

అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదాలను వడ్డిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం భారీ అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఆషాఢ మాసం శాకంబరీదేవిగా నీలమణిదుర్గ అమ్మవారి మహోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం అన్నప్రసాదాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి భక్తులకు వడ్డించారు. అమ్మవారి కాలనీ వాసులతోపాటు పాతపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు, సుదర్శనరావు, వైస్ ఎంపీపీ ప్రదీప్, ధర్మకర్తలు కృష్ణారావు, నేతాజీ, తిరుపతిరావు, వెంకటరమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

పాతపట్నం: ఆదివాసీల హక్కుల సాధనకు అందరూ కలిసి పోరాడాలని, ఈ నేల 26వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ కన్వీనర్ వాబ యోగి పిలుపునిచ్చారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆదివాసీ భవనంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగి మాట్లాడుతూ బోయి వాల్మీకి, నకిలి బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దన్నారు. జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు గురాడి అప్పన్న, బి.సింహాచలం, ఎ.రామారావు, ఎం.శ్రీను, కె.రాంబాబు, డి.పార్వతీశం, జె.వాసు, బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ



కాంతారావును సన్మానిస్తున్న దృశ్యం

పాతపట్నం: విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో క్రియేటివ్ హార్ట్స్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు శతజయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మండలంలోని బడ్డుమర్రి పంచాయతీ రాజన్నపేటకు చెందిన మల్లిపురం కాంతరావు జాతీయ స్థాయి అవార్డు సాధించాడు. ఈ నెల 9వ తేదీన విజయవాడలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో జిల్లాకు చెందిన మల్లిపురం కాంతారావు, రాహుల్ పట్నాయక్ ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కాంతరావును ప్రశంసాపత్రం, మెమోంటోతో క్రియేటివ్ హార్ట్స్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంజి, కె.సుందర్ సత్కరించారు.

అభివృద్ధి పథంలో గోకర్ణపురం



చివరి దశకు చేరుకున్న రైతు భరోసా కేంద్రం భవనం పనులు

- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తి
- రూ.22 లక్షలతో ఆర్‌బీకే రూ.17 లక్షలతో వైఎస్సార్ ఆరోగ్యం కేంద్రం
- రూ.16.22 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.7.25 కోట్లు పంచాయతీ ప్రజలకు లబ్ధి
- ఇంత అభివృద్ధి జరిగినా తప్పడు ప్రచారం చేయటం తగదు..



గ్రామ సచివాలయ భవనం

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత (ఈ నాలుగేళ్లలో) మెళియాపుట్టి మండలం గోకర్ణపురం పంచాయతీ ఎంతో అభివృద్ధి సాధించింది. ఈ పంచాయతీకి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని సర్పంచ్ తప్పుడు ప్రచారం చేయటం దురదృష్టకరమని స్థానికులు అంటున్నారు. ఈ పంచాయతీలో చిన్నహంస, మొజ్జాడపాలెం గ్రామాలు ఉన్నాయి.

గోకర్ణపురం పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- చిన్నహంసలో బి.కలవాడు ఇంటి నుంచి సవరయ్య ఇంటి వరకు రూ.3.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- చిన్నహంసలో సోమేశ్వరరావు ఇంటి నుంచి అప్పారావు ఇంటి వరకు రూ.3.56 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు.
- చిన్నహంస మెయిన్ రోడ్డు నుంచి అంగన్‌వాడీ కేంద్రం వరకు రూ.9.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- గోకర్ణపురంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టారు. రూ.17 లక్షల ఖర్చుతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య (హెల్త్ వెల్త్) కేంద్రం భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.
- నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిదారులకు సుమారు రూ.7.25 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరింది.
- గోకర్ణపురం గ్రామానికి ఎప్పటి నుంచో పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన రాధా సాగరం గెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు, ఇతర శాఖల అనుమతి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించటం జరిగింది.

రాధా సాగరం సమస్య పరిష్కార్యానికి చర్యలు



గోకర్ణపురం పంచాయతీని ఎంతో అభివృద్ధి చేశాం. అక్కడి ప్రధాన సమస్య రాధా సాగరం గెడ్డపై వంతెన నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించటం జరిగింది. అన్ని అమోదాలు లభించాయి. నిధులు మంజూరు స్థాయిలో ఉంది. సంబంధిత మంత్రి, కమిషనర్‌తో మాట్లాడి తక్షణమే నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటాను.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



లొద్దలపేటలో తాగునీటి కుళాయి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో బెలమాం, లొద్దలపేట గ్రామాల్లో రూ.85 లక్షలతో నిర్మించిన ఇంటింటికీ తాగునీటి కుళాయిలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పరిపాలనలో రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి వంటి సౌకర్యాలను కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు బలసలరేవు బ్రిడ్జికి అనుసంధానంగా గంగ్రేడు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని బెలమాం గ్రామస్తులు కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పీకర్ తెలియజేశారు. సర్పంచ్ కణుగుల కిశోర్, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బెండి గాం.దీ, మాజీ సర్పంచ్ సీపాన మల్లేశ్వరరావు, పంచాది పాపారావు, తమ్మినేని గురునాథరావు, పూజారి సూర్యం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి దమయంతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ఈ నాలుగేళ్లలో నరసన్నపేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కోరారు. పోలాకి మండలం బెలమరపాలవలస, ప్రియాగ్రహారం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో సోమవారం పాల్గొని మాట్లాడారు. బెలమర బీసీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రహదారిని ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఏఎంసీ చైర్మెన్ దుంపల భాస్కరరావు, సర్పంచ్‌లు చింతు రాఘవరావు, బెవర నూకయ్య, ఎంపీటీసీలు కైబాడ సుజాత, సుంకరి ప్రసాదరావు, పార్టీ సీనియర్ నాయకులు చింతు సింహాచలం, కిల్లి లక్ష్మణరావు, బెండి శ్రీనివాసరావు, చింతాడ ప్రసాదరావు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు రక్ష



పాతపట్నం: గంగువాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష అద్భుత కార్యక్రమమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండలంలోని గంగువాడ గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంద్వారా అర్హులకు 11 రకాల సేవలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. ఆమదాలవలస మండలంలో చీమలవలస గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. హిమండలం మండల కేంద్రంలో జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జి ఏపీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో జగనన్న సురక్షపై అవగాహన కల్పించి, ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస రూరల్: చీమలవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నకిలీ మస్తర్లపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ధనుకువాడ గ్రామస్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని ధనుకువాడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లకుండా మస్తర్లు వేసి వేతనదారుల పేరుతో డబ్బులు డ్రా చేస్తున్నారని, ఆ గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ గ్రామానికి చెందిన ఉపాధి ఎఫ్ఏ.. ఆదే గ్రామానికి చెందిన పొన్నాన కిశోర్ జాబ్ కార్డుపై జూన్ 15 నుంచి జూలై 5వ తేదీ వరకు పనికి వెళ్లకుండా రూ.4,029, పొన్నాన లావణ్య జాబ్‌కార్డుపై రూ.4,029 నిధులు స్వాహా చేశారని గ్రామస్తులు కలెక్టర్ స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వివరించారు. పొన్నాన కిశోర్, పొన్నాన లావణ్య విశాఖపట్నంలో ఉంటూ.. ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తామని కలెక్టర్, జేసీ తెలిపారు.

కల్వర్టు నిర్మాణం



పొన్నాంపేట వద్ద చేపడుతున్న కల్వర్టు పనులు

ఆమదాలవలస రూరల్: మండలంలో ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం గ్రామానికి గల ఆర్‌అండ్‌బీ రహదారిలో పొన్నాంపేట వద్ద కల్వర్టు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించిన యంత్రాంగం కల్వర్టు పనులను వేగవంతంగా చేపడుతున్నారు. శిథిలమైన కల్వర్టును తొలగించి దాని స్థానంలో కొత్త కల్వర్టును నిర్మిస్తున్నారు. కల్వర్టు పనులు జరుగుతున్నందున వాహన రాకపోకలను పురుషోత్తపురం నుంచి వచ్చేవాటిని రామచంద్రాపురం, చిట్టివలస, గాజులకొల్లివలస గ్రామాల మీదుగా ఆమదాలవలస చేరుకునేలా రహదారి మార్గాన్ని కల్పించారు. కల్వర్టు పనులు రెండు రోజులు పట్టే సమయం ఉన్నందున ప్రయాణికులు, వాహనదారులు వేరొక మార్గాన ప్రయాణాలు సాగించాలని కాంట్రాక్టర్ తెలియజేశారు. కల్వర్టు పనులు సకాలంలో పూర్తిచేసి రహదారి మార్గాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.



ఆమదాలవలస: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు



పోలాకి: చింతువానిపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ధర్మాన ఎమ్మెల్యే కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

ఆమదాలవలస: పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, పాత కంద్రపేట, కుప్పిలి వీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ.. సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఈ నాలుగేళ్లల్లో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలుపరిచిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోకి తీసువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి అజంత కుమారి, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రవి, పాదిలాపు తిరుపతి, కుప్పిలి సత్యనారాయణ, పొన్నాడ చిన్నారావు, సంపతిరావు రామారావు, మావిడి రమేష్, సాధు చిరంజీవి, ఎ.విజయ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా..

పోలాకి: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం పోలాకి మండలం చెల్లాయివలస సచివాలయం పరిధిలోని అంబీరుపేట, కమ్మరిపేట, చింతువానిపేట గ్రామాల్లో స్థానిక సర్పంచ్ చింతు జగ్గునాయుడు, వైస్ ఎంపీపీ కోట అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లో మీడియా ద్వారా ప్రభావితమైన కొందరు వ్యక్తులు విపక్ష భావజాలంతో మాట్లాడుతున్నారని, అలాంటివారు వాస్తవాలు గమనించేందుకు ప్రజల్లోకి రావాలన్నారు. సద్విమర్శలు ఎవరు చేసినా స్వీకరిస్తామన్నారు. సంక్షేమ పథకాలు అమలుచేసి తద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని అభినందించటం ఇష్టంలేక ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. గ్రామాల్లోనే విద్య, ఉపాధి, వైద్యం, వ్యవసాయరంగాలకు పెద్దపీట వేస్తూ చేస్తున్న కార్యక్రమాలను కళ్లుండి చూడలేని వారిపట్ల సానుభూతి తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. అసత్య ఆరోపణలు చేయడం ప్రతిపక్ష పార్టీల నాయకులకు తగదన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి పి.చిరంజీవి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, జేసీఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు, పార్టీ నాయకులు చింతు రామకృష్ణ, రెంటికోట త్రినాథరావు, పార్టీ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

కొత్తూరు: మండలంలోని కారిగూడ పంచాయతీ పరిధి దిగువ, ఎగువ, దొండమానుగూడ, అడ్డాయిగూడ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని కోరారు. లబ్బ గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన గ్రామాలకు రక్షణ గోడలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కరిస్తే గ్రామల్లోకి వరదనీరు వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజన యువకులు పాల్గొన్నారు.

పవన్ క్షమాపణ చెప్పాలి



నరసన్నపేట: పవన్ ఫొటోకు చెప్పుతో కొడుతున్న గ్రామ వలంటీర్



సారవకోట: నిరసన తెలియజేస్తున్న గ్రామ వలంటీర్లు

నరసన్నపేట/సారవకోట/కొత్తూరు/పాతపట్నం: వారాహి యాత్రలో భాగంగా ఆదివారం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నరసన్నపేట, సారవకోట, కొత్తూరు మండలాలకు చెందిన గ్రామ వలంటీర్ల బగ్గుమన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, వెంటనే క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నరసన్నపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి వైఎస్సార్ కూడలి వరకు పోలాకి జెడ్పీటీసీ, బీసీ సెల్ జోనల్ కన్వీనర్ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. సారవకోట మండలంలోని కుమ్మరిగుంట సచివాలయ ఎదుట గ్రామ వలంటీర్లు నిరసన తెలియజేశారు. కొత్తూరులోని నాలుగు రోడ్లు కూడలి వద్ద గ్రామ వలంటీర్లు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కొత్తూరు మండలం గ్రామ వలంటీర్ల సంఘం అధ్యక్షుడు వి.సూరిబాబు ఆధ్వర్యంలో పవన్ చిత్రపటాన్ని దహనం చేశారు. పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్‌కు గ్రామ వలంటీర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. కరోనా సమయంలో గ్రామ వలంటీర్లు చేసిన సేవ ఎంతో గొప్పదని, అటువంటి వారిని అభినందించాల్సిన పవన్.. వారిపై అక్కసుతో మాట్లాడటం శోచనీయమన్నారు. వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.



కొత్తూరు: పనన్ కల్యాణ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న గ్రామ వలంటీర్లు



పాతపట్నం: ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామ వలంటీర్లు

కంటి శస్త్రచికిత్సలకు 65 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నంరాజు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖపట్టణం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సత్యసాయి మందిరంలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 65 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. సత్యసాయి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ పర్యవేక్షణలో శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యుడు ఎస్.రత్నంరాజు 137 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో శస్త్ర చికిత్సలు అవసరమైన 65 మందిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.